## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం






ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 79 సోమవారం జూలై 20, 2026, పేజీలు - 4 వెల :2/-


# 'సర్' ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ పూర్తయ్యేదాకా క్షేత్రస్థాయిలోనే ఉండండి

-3 దాకా గాంధీభవన్‌కు రావొద్దు
-నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులు అడగొద్దు
-బీఎల్‌వోల రిపోర్టులపైనే ఆధారపడొద్దు
-పార్టీ బీఎల్‌ఏలను సమర్థంగా ఉపయోగించుకోండి
-సర్‌పై నాయకులు, పార్టీ శ్రేణులకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్, జూలై 19 హిందూస్థాన్ మీడియా

సర్ ప్రక్రియకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. పెరిగిన సమయాన్ని అవకాశం గా తీసుకొని పార్టీ శ్రేణులంతా ఆగస్టు 3వ తేదీ దాకా క్షేత్రస్థాయిలో శ్రమించాలని అన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ పూర్తయ్యేదాకా నామినేటెడ్ పోస్టులని, పార్టీ పదవులని ఎవ్వరూ గాంధీ భవన్‌కు రావొద్దని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా వచ్చినా.. ముఖ్యనాయకులు వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వ వద్దని పేర్కొన్నారు. సర్ అంశంలో నియోజకవర్గాల బాధ్యుల పనితీరుపై ఆదివారం ఆయన వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నట రాజన్, టీపీసీసీ చీఫ్ మహ్హేషగౌడ్, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్‌కు సంబం ధించి నియోజకవర్గ ఇన్‌చార్జులు, సమన్వయ కర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 119 నియోజక వర్గాలు ఉంటే.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్ ప్రక్రియపై కేవలం 489 సమావేశాలు జరగాయని అన్నారు. సర్ అంశంలో 25 నియోజకవర్గాల్లో పని తీరు బాగోలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో నాలుగు నియోజకవర్గాల్లో అసలు పనే జరగలేదన్నారు. బాగా వెనుకబడిన నియోజకవర్గాల బాధ్యులు ఇప్పటికైనా స్పందించాలన్నారు. కొందరు నాయకులు హైదరాబాద్‌కే పరిమితమయ్యారని, తమ నియోజకవర్గాల్లో పని చేయట్లేదని అభ్యంతరం



వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు నాయకులంతా క్షేత్రస్థాయిలోనే ఉండి సర్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. పది మంది ఇన్‌చార్జి మంత్రులు సోమవారం అన్ని జిల్లాల్లో సర్‌పై సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపీలు పార్ల మెంటు సమావేశాల్లో ఉన్నా.. వారు ఇన్‌చార్జులు గా ఉన్నచోట్ల ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిం చాల న్నారు. సరిగా పనిచేయని పక్షంలో కఠినంగా వ్యవ హరిస్తామని స్పష్టం చేశారు.

## బహ్రెయిన్‌లో సందడిగా బోనాల పండుగ

-బాంబుల మోత మధ్యలోనూ బోనమెత్తారు



(హిందూస్థాన్ మీడియా గల్ఫ్ ప్రతినిధి)

ఇరాన్ క్షిపణి దాడులతో యుద్ధ వాతావరణం నెలకొని ఉన్న బహ్రెయిన్‌లోని తెలుగు ప్రజలు బోనాల పండుగ చేసుకున్నారు. యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భయం గుప్పిట జీవిస్తున్నప్పటికీ.. సమాజ శాంతి, సుభిక్షతను కోరుకుంటా మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. తెలుగు కళా సమితి అధ్వర్యంలో బహ్రెయిన్‌లో శుక్రవారం నిర్వహించిన బోనాల పండుగలో తెలంగాణ ప్రవాసీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారత రాయబారి వినోద్ జాకబ్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో పోతరాజుల ప్రదర్శన, బోనాల ఊరేగింపు ఆకట్టుకున్నాయి. పోతరాజు పాత్ర వేసిన ప్రతిసారి తనకు హైదరాబాద్‌లోని మహంకాళి అమ్మవారి ఎదుట ఉన్న అనుభూతి కలుగుతుందని హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ్ చెప్పారు. తన తాత పోతరాజు పాత్రదారులను అలంకరించిన తీరును చిన్నతనంలో గమనించాని, ఇప్పుడు బహ్రెయిన్‌లో పోతరాజులను అలాగే అలంకరిస్తున్నానని జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన అక్షయ అన్నారు.

## విక్రమ్-1 విజయంలో తెలుగు తేజాల కృషి

-సీఈవో పవన్‌కుమార్, సీవోవో నాగభరత్ మన వాళ్లే
-పవన్‌ది మచిలీపట్నం, నాగభరత్‌ది ఒంగోలు సమీపం బి.నిడమనూరు
-ఇస్రోలో ఉద్యోగాలు వదులుకుని 'స్కైరూట్ ఏరోస్పేస్' స్థాపన




ఏలూరు అర్బన్, మచిలీపట్నం టౌన్, జూలై 19

భారత అంతరిక్ష ప్రయోగాల్లో నవశకానికి నాంది పలుకుతూ శ్రీహరికోట నుంచి శనివారం ప్రయోగించిన తొలి ఆర్బిటల్ రాకెట్ విక్రమ్–1 విజయవంతమైంది. అయితే ఈ విజయంలో ప్రధాన భూమిక నిర్వహించిన సీఈవో చందన పవన్ కుమార్, సీవోవో నాగభరత్ డాకా ఏపీకి చెందిన వారే కావడం విశేషం. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ విక్రమ్–1 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో ఆ సంస్థ సీఈవోగా పనిచేస్తున్న మచిలీపట్నానికి చెందిన చందన పవన్‌కుమార్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. పవన్‌కుమార్ తండ్రి చందన శ్రీనివాస్ మచిలీపట్నంలో కన్సల్టెంట్ ఇంజనీర్‌గా పనిచేశారు. పవన్ మచిలీపట్నంలోనే ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఖరగ్‌పూర్ ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చేశారు. ఇస్రోలో కొంతకాలం పనిచేశాక 2018లో నాగభరత్‌తో కలిసి స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. ఆ సంస్థ ప్రయోగించిన విక్రమ్–1 విజయవంతం కావడంతో చందన పవన్‌కుమార్‌ను మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు.

**నాగభరత్ డాకాకు ఏలూరుతో ప్రత్యేక అనుబంధం**

నాగభరత్ డాకాకు ఏలూరుతో ప్రత్యేక అనుబంధం ఉంది. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ ప్రయాణంలో నాగభరత్ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ (సీవోవో)గా వ్యవహరిస్తున్నారు. ఏలూరుకు చెందిన చావలి శ్రీరామచంద్రమూర్తి, బాలత్రిపుర సుందరి దంపతుల కుమార్తె పావనిని... ఒంగోలు సమీపంలోని బి.నిడమనూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ రఘురామిరెడ్డి, శాంతలక్ష్మి దంపతుల కుమారుడు నాగభరత్ 2016లో వివాహమాడారు. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన పావని... ప్రస్తుతం హైదరాబాద్ డెలాయిట్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. నాగభరత్, పావని దంపతులకు రామతేజస్ (6), సుహాస్ (రెండున్నరేళ్లు) కుమారులు. ఐఐటీ మద్రాసులో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన నాగభరత్‌తోపాటు ఖరగ్‌పూర్ ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన పవన్‌కుమార్ చందన (రాజమహేంద్రవరం) 'ఇస్రో'లో శాస్త్రవేత్తలుగా పనిచేశారు. ఇస్రోకు దీటుగా ప్రైవేటు రంగంలో చరిత్ర సృష్టించాలన్న లక్ష్యంతో ఈ ఇద్దరూ ఆ ఉద్యోగాలు వదులుకుని 2018లో స్టార్టప్‌గా స్కైరూట్ ఏరోస్పేస్‌ను ప్రారంభించారు. ఈ సంస్థకు నాగభరత్ సీవోవోగా, పవన్‌కుమార్ సీఈవోగా ఉన్నారు. ఎనిమిదేళ్ల పాటు ఎంతో శ్రమించి.. దేశం గర్వించదగ్గ రీతిలో విక్రమ్–1 ప్రయోగాన్ని విజయవంతం చేశారు.

# బీఆర్ఎస్‌కు మల్లారెడ్డి గుడ్ బై

## కార్యక్రమాలకు హాజరుకాని మేడ్చల్ ఎమ్మెల్యే

-18న ఘట్‌కేసర్‌లో సీఎం సభకు హాజరు
-కేసీఆర్ కుటుంబంపై రేవంత్ విమర్శలు
-సభ ముగిశాకైనా ఖండించని మాజీ మంత్రి
-సోషల్ మీడియాలో బీఆర్ఎస్ శ్రేణుల ఫైర్
-పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్
-మల్లన్నా.. మౌనమేల?: క్రిశాంక్ ప్రశ్న

హైదరాబాద్/మేడ్చల్/మేడ్చల్ టౌన్, జూలై 19

బీఆర్ఎస్ కీలక నేత, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.. ఆ పార్టీని వీడతారంటూ కొన్నాళ్లుగా జరుగుతున్న చర్చ తాజాగా ఊపందుకుంది. కొంతకాలంగా బీఆర్ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న మల్లారెడ్డి.. ఈ నెల 18న ఘట్‌కేసర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభకు హాజరు కావడమే ఇందుకు కారణం. అంతేకాదు.. సభలో రేవంత్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు చేస్తున్నా పట్టించుకోలేదు. సభ ముగిసిన తర్వాతనైనా , కనీసం మరుసటి రోజైనా (ఆదివారమైనా) రేవంత్ విమర్శలను మల్లారెడ్డి ఖండించలేదు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆవేదన చెందాయి. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ జయంతిని పురస్క రించుకొని ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమం లో ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేగా పాల్గొన్నారను కున్నా.. సీఎం విమర్శలపై ప్రైవేటుగానైనా స్పందిం చలేదని మల్లారెడ్డిపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్



మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశాయి. మల్లారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ బీఆర్ఎస్ క్యాడర్ డిమాండ్ చేసింది. మరోవైపు 'ఇప్పుడు ఏం బ్లాక్‌మెయిల్ చేశాడని సైలెంట్ అయినవ్ మల్లన్నా?' అంటూ బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ పరిణామాల తరువాత కూడా మల్లారెడ్డి స్పందించకపోవడంతో ఆయన బీఆర్ఎస్ లో ఉన్నట్లా? లేనట్లా? అన్న చర్చ మొదలైంది. వాస్తవానికి మల్లారెడ్డిపై మేడ్చల్ బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు గతంలోనే పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పార్టీ కార్యకలాపాలకు ఆయన దూరంగా ఉండడంతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కూడా హాజరు కావడంలేదు. దీంతో ఈ బాధ్యతలను వీలైతే ఇంకెవ రికైనా అప్పగిస్తే మంచిదని వారు కోరారట.

**కుటుంబంతో కలిసి ప్రధాని మోదీ వద్దకు**

మల్లారెడ్డి గతంతో తన కొడుకు భద్రారెడ్డి, కోడలు ప్రీతిరెడ్డితో కలిసి ప్రధాని మోదీని కలిసిన విషయం తెలిసిందే. తన విద్యా సంస్థల వ్యాప్తిలో భాగంగానే ప్రధానిని కలిసినట్టు సన్నిహితులు చెప్పుకొచ్చినా.. బీఆర్ఎస్ శ్రేణులు బీజేపీలో చేర డానికే మోదీని కలిశారని నమ్ము తున్నారు. వ్యాపా ర సామ్రాజ్యాన్ని దేశమంతటా విస్తరింపజేసేందుకు బీజేపీ ప్రభుత్వం మద్దతు కోసం మల్లారెడ్డి యత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయనను తమ పార్టీలో తీసుకురావాలని భావించిన కాంగ్రెస్ సీనియర్లు పీసీసీ స్థాయిలో చర్చలు జరిపినట్టు తెలిసింది. గతంలో ఆయన ప్రస్తుత కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌నూ కలిశారు. పైగా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు తగ్గించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల వరకు మల్లారెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తారంటూ ఆ పార్టీ నేతలు కొందరు ప్రచారం చేస్తున్నారు.

## కష్టాల కడలిలో గిరి విద్యార్థుల చదువులు

-మౌలిక వసతులు, సదుపాయాలు కరువు..
-51 మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్
-పోలవరం జిల్లా మెట్టగూడెం బడి దుస్థితి..
-పక్కా భవనం కోసం ఎదురుచూపులు

మోతుగూడెం, జూలై 19

ఒక పక్క డిజిటల్ క్లాసులు, కార్పొరేట్ స్థాయి వసతులు అంటూ ప్రభుత్వం దూసుకుపోతోంది. మరోవైపు గిరిజన విద్యార్థుల చదువు కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ గొప్పలు చెప్పుకొంటోంది. కానీ.. కొన్ని మారుమూల గిరిజన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అందుకు పోలవరం జిల్లా గుర్తేడు మండలం బొడ్డగండి గ్రామ పంచాయతీ పరిధిలోని మెట్టగూడెం గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాల (జీపీఎస్) దుస్థితే ఉదాహరణ. రంపచోడవరం ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో నడుపుతున్న మెట్టగూడెంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలకు (జీపీఎస్) పక్కా భవనం లేదు. కేవలం మట్టిగోడలతో ఉన్న చిన్న రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్నారు. మెట్టగూడెం, రెడ్డినగర్ గిరిజన గ్రామాలకు చెందిన 51మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ కేవలం ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉండటం గమనార్హం.

**ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..**

ఈ షెడ్‌లోనే ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నిర్వహిస్తున్నారు. బెంచీలు లేక విద్యార్థులు నేలమీదే కూర్చుంటున్నారు. ఎండకాలం వస్తే ఆ సిమెంటు రేకులు సెగలతో వేడెక్కిపోతోంది. వర్షాకాలం వస్తే పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతుంది. ఇలా విద్యార్థులు ఇటు ఎండకు ఎం డుతూ, వానకు తడుస్తూ చదువులు సాగిస్తున్నారు. పెద్ద వర్షం వస్తే ఇక అంతే సంగతులు. ఇంకోవైపు మంచినీటి వసతి లేదు. బోరు ఉన్నప్పటికీ ఏడాది నుంచి పనిచేయడం లేదు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. షెడ్ చట్టూ తుప్పలు ఉండడంతో కీటకాలు వస్తున్నాయని పిల్లలు చెబుతున్నారు. వంట గది, భోజనం చేయడానికి సదుపాయం లేకపోవడంతో మధ్యా హ్న భోజనం కోసం



విద్యార్థులు 300 మీటర్ల దూరంలో ఉన్న వంట కార్మికురాలి ఇంటికి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి.

**లోకేశ్ సారు స్పందిస్తేనే బడి భవనం!**

ప్రభుత్వాలు మారుతున్నా, పథకాల పేర్లు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఈపాఠశాల రాత మాత్రం మారలేదు. అధికారులు ఏటా సర్వేల పేరుతో వస్తుంటారు, ఫొటోలు తీసుకుని, నివేదికలు సిద్ధం చేసుకుని వెళ్తుంటారు తప్ప.. నేటికి శాశ్వత భవన నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి మెట్ట గూడెంలోని గిరిజన ప్రాథమిక పాఠశాల (జీపీఎస్)కు భవనం నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. 'విద్యాశాఖ మంత్రి లోకేశ్ సారూ.. మా పాఠశాలకు భవనం కట్టించాల'ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## జపాన్ ఓపెన్ ఛాంపియన్‌గా పీవీ సింధు
## జపాన్ గడ్డపై సత్తా చాటిన తెలుగు తేజం



హైదరాబాద్, హిందుస్థాన్ మీడియా:

భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో మరో చారిత్రక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచి భారత క్రీడా చరిత్రలో మరో మైలురాయిని నెలకొల్పింది. టోక్యో మెట్రోపాలిటన్ జిమ్నాసియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ నంబర్-3, జపాన్ స్టార్ అకానే యామగూచిని వరుస గేమ్‌ల్లో 21-17, 21-17 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. హోం ప్రేక్షకుల మద్దతు ప్రత్యర్థికి ఉన్నప్పటికీ, ఒత్తిడిని ఏమాత్రం లెక్కచేయకుండా సింధు అత్యుత్తమ ఆటతీరుతో విజయం సాధించింది. మొదటి గేమ్‌లో క్రాస్‌కోర్ట్ డ్రాప్స్, పవర్‌ఫుల్ స్మాష్‌లు, కచ్చితమైన నెట్‌ప్లేతో యామగూచిని ఇబ్బంది పెట్టిన సింధు కీలక పాయింట్లను సొంతం చేసుకొని 21-17తో గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో కూడా అదే దూకుడును కొనసాగించి ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా మరోసారి 21-17తో గెలిచి మ్యాచ్‌ను ముగించింది. గత రెండేళ్లుగా తన ఫామ్‌పై వచ్చిన విమర్శలకు ఈ విజయంతో సింధు గట్టి సమాధానం ఇచ్చింది. అనుభవం, వ్యూహాత్మక ఆట, మానసిక దృఢత్వంతో మరోసారి ప్రపంచ స్థాయి షట్లర్‌గా తన సత్తా చాటింది.ఈ విజయంతో జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి భారతీయ మహిళా షట్లర్‌గా పీవీ సింధు అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు, ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు.

## బస్వాపురం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి చెరువులు నింపాలి
**-సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి.జహంగీర్ డిమాండ్**



హిందుస్థాన్ మీడియా

బస్వాపురం ప్రాజెక్టులోని నీటిని వెంటనే విడుదల చేసి ప్రాజెక్టు పరిధిలోని చెరువులను నింపడంతో పాటు రైతులకు సాగునీరు అందించాలని,ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించి,మిగిలిన పనులను పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపురం ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు గేట్ల వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ..జిల్లా రైతాంగానికి కీలకమైన బస్వాపురం ప్రాజెక్టు పనులను పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ప్రాజెక్టులో ఉన్న 0.6 టీఎంసీల నీటిని విడుదల చేస్తే ఐదు నుంచి ఆరు మండలాల్లోని చెరువులు నిండి,సాగునీటితో పాటు భూగర్భ జలమట్టం పెరిగి బోర్లు,బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ విడుదల చేయడంలో స్థానిక ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్,నీటిపారుదల శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు,జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ నినాదాన్ని పలుచన చేసింది కేసీఆరే...!
**-తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు**



హిందుస్థాన్ మీడియా

తెలంగాణ నినాదాన్ని పలుచన చేసింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు విమర్శించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూ వివేరా హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ంటీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చినప్పుడే తెలంగాణ ఆత్మను బలహీనపరిచారని ఆరోపి ంచారు. బీఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా ప్రకటించి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో పార్టీ కార్యాలయాలు ప్రారంభించడం ద్వారా ఇతర రాష్ట్రాల రాజకీయాలకు తలుపులు తెరిచారని,దీనికి పూర్తి బాధ్యత కేసీఆర్ దేనని అన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికాకు వెళ్లాలని వ్యాఖ్యానించిన సామేలు,కేసీఆర్ కుటుంబంలోనే పంపకాల పంచాయితీ మొదలైందని ఎద్దేవా చేశారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

# సమాచార హక్కు చట్టంతోనే ప్రభుత్వంలో పారదర్శకత సాధ్యం

**-సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో మెమోరాండం స్వీకరణ**
**-దివంగత విద్యావేత్త కాసా రామ్మూర్తికి ఘన నివాళులు**



హిందుస్థాన్ మీడియా

ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం అత్యంత శక్తివంతమైన సాధనమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఆర్టీఏ కమిషనర్, రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు వర్రె వెంకటేశ్వర్లు అన్నారు .ఆదివారం సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యరమాద కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వర్రె వెంకటేశ్వర్లుకు పలు ప్రజా సమస్యలు, చట్టపరమైన అంశాలకు సంబంధించిన మెమోరాండాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడిన ఆయన,ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని అన్నారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రశ్నించే హక్కు ప్రజలకు లభిస్తుందని, దీనివల్ల ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతతో పాటు జవాబుదారీతనం కూడా పెరుగుతుందని వివరించారు.సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని, తమ హక్కులను చట్టబద్ధంగా సాధించుకోవడానికి అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా కార్యదర్శి దండా వెంకట్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు గుంటకండ్ల ముకుందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రావుల రాంబాబు, నియోజకవర్గ అధ్యక్షులు బంగారు శ్రీధర్, పట్టణ అధ్యక్షులు పిడమర్తి ఉపేందర్‌తో పాటు పలువురు సభ్యులుపాల్గొన్నారు.అనంతరం సూర్యాపేట పట్టణంలోని ట్రిపుల్ ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అర్థశాస్త్ర లెక్చరర్, శ్రీచైతన్య విద్యాసంస్థ మాజీ ప్రధానోపాధ్యాయులు దివంగత కాసా రామ్మూర్తి దశదిన సంస్మరణ కార్యక్రమానికి వర్రె వెంకటేశ్వర్లు, యరమాద కృష్ణరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.విద్యా రంగంలో రామ్మూర్తి అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆదర్శవంతమైన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియా డారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సంస్మరణ కార్యక్రమంలో దివంగత రామ్మూర్తి సతీమణి కాసా శారద, కుమార్తెలు కాసా స్నేహిత, కాసా హర్షిత, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్‌కు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది బీఆర్ఎస్ హయాంలోనే

**-మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి**

హిందుస్థాన్ మీడియా

మర్రిగూడ ఫ్లైఓవర్‌కు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,మేయర్ బుర్రి చైతన్య చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తెలిపారు.మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన పలు అంశాలపై స్పందించారు.ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తై రెండు నెలలు గడిచినా ప్రారంభించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు.ఈ విషయాన్ని స్థానికులు,మీడియా,ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో ప్రజల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా,పోలీసులతో దౌర్జన్యంగా అణచివేశారని విమర్శించారు.తాము అధికారంలో ఉన్నప్పుడు తాళాలు పగులగొట్టి ప్రారంభోత్సవాలు చేయలేదని, తిప్పర్తి మోడల్ స్కూల్,ఆర్డీఓ కార్యాలయం ప్రారంభోత్సవాల తరహాలో వ్యవహరించలేదని పేర్కొన్నారు.మెడికల్ కళాశాల బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయిందని,దానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమైనా నిధులు తీసుకొచ్చి ఉంటే సంబంధిత జీఓ చూపించాలని సవాల్ విసిరారు.ఐటీ మంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఐటీ టవర్ తీసుకురాలేకపోయారని,తర్వాత ఏర్పాటైన ఐటీ టవర్‌ను కూడా నిరుపయోగంగా మార్చారని విమర్శించారు.ప్రస్తుతం జరుగుతున్న రూ.216 కోట్ల అండర్ డ్రైనేజీ పనులకు జీఓ ఆర్‌టీఈ నెం.762,తేదీ 29-09-2023 ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందని తెలిపారు.అలాగే నగరంలో జరుగుతున్న సీసీ రోడ్లు,రూ.36 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఎన్జీ కళాశాల,పానగల్ ట్యాంక్‌బండ్ సుందరీకరణ,పచ్చల ఛాయా వెంకటేశ్వర దేవాలయాల అభివృద్ధి, శిల్పారామం, నల్లగొండ కళాభారతి వంటి అభివృద్ధి కార్యక్రమాలన్నీ బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. వాటిని ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గత 23 ఏళ్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యే నల్లగొండకు చేసిన అభివృద్ధిపై,బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులపై ఎక్కడైనా,ఏ వేదికపైనైనా బహిరంగ చర్చకు సిద్ధమని సైదిరెడ్డి సవాల్ విసిరారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో



జరుగుతున్న అవినీతి,అక్రమాలు,అసమర్థ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకే మేయర్ ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.ఇప్పటికైనా తప్పుడు విమర్శలు మాని నల్లగొండ నగర అభివృద్ధిపై దృష్టి సారించాలని, కనీసం ప్రజల్లో మర్యాద దక్కుతుందని హితవు పలికారు.రాబోయే రోజుల్లో ప్రజల ఆదరణతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, నల్లగొండ మేయర్ పీఠాన్ని కూడా బీఆర్ఎస్ తిరిగి కైవసం చేసుకుంటుందని మందడి సైదిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# సంఘ ఐక్యతతోనే ఆర్యవైశ్య సమాజ అభివృద్ధి సాధ్యం

హిందుస్థాన్ మీడియా

ఎన్నికలు ముగిసిన తర్వాత విభేదాలను పక్కనపెట్టి అందరూ ఐక్యంగా పనిచేస్తేనే ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేది లక్షాధి అన్నారు.ఆదివారం నిర్వహించిన సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించిన ఎన్నికల కమిటీని అభినందించిన వారు,నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సంఘంలోని సమస్యలను సోషల్ మీడియాలో కాకుండా కార్యవర్గ సమావేశాల్లో చర్చించి పరిష్కరించుకోవాలని,విమర్శల కంటే నిర్మాణాత్మక సూచనలు,సేవాభావమే సంఘాభివృద్ధికి దోహదప డతాయని పేర్కొన్నారు.ఆర్యవైశ్య మహాసభకు 128 ఏళ్ల చరిత్ర ఉందని,రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వాన్ని రెండు లక్షలకు విస్తరించడమే లక్ష్యమని




తెలిపారు.తిరుపతిలో మహాసభకు 50 ఎకరాల భూమి కేటాయించబడిందని, త్వరలో భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అలాగే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు రూ.2 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ,నూతన అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ,కోశాధికారి ఉప్పల శ్రావణ్ కుమార్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిం చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు, పొలిటికల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, అదనపు కార్యదర్శి గుండా వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# బోనమెత్తిన బోనగిరి..కోట మైసమ్మకు ఘనంగా తొలి బోనం

హిందుస్థాన్ మీడియా

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమ య్యాయి. పట్టణంలోని కోట మైసమ్మ గ్రామదేవత ఆలయంలో కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో తొలి సారిగా తొలి బోనాన్ని ఘనంగా సమర్పించారు. వర్షాకాలంలో ప్రబలే అంటు వ్యాధులు, విషజ్వరాలు ప్రజల దరిచేరకుండా కాపాడాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత బోనం ఎత్తి కోట మైసమ్మకు సమర్పించారు.మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు, తలంబ్రాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించగా,డప్పు వాయిద్యాలు, పోతు రాజుల విన్యాసాలు,భక్తుల జైజైధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళ లాడాయి.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జహంగీర్,మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, కౌన్సిలర్లు బెండ స్వరూప,జాలిగం విఘ్నేష్, స్థానిక నాయకులు లాల్‌రాజ్,కుమ్మర్ల సంఘం




పెద్దలు తాడూరి బాలమల్లయ్య,తాడూరి కిష్టయ్య, తాడూరి నరసింహతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు,సంఘ నాయ కులు, భక్తులు పాల్గొన్నారు.

బిజినెస్

# శాంసంగ్ కీలక నిర్ణయం.. అమెరికాలో ఉద్యోగాల కోత

-అమెరికాలో ఉద్యోగాలకు కోత పెట్టిన శాంసంగ్
-న్యూజెర్సీ నుంచి టెక్సాస్‌కు మారనున్న ప్రధాన కార్యాలయం
-739 మంది ఉద్యోగులపై ప్రభావం, కొందరికి తొలగింపు
-ఏఐ చిప్‌ల వ్యాపారం జోరుగా ఉన్నా మొబైల్ విభాగం నష్టాల్లోకి
-టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా సంస్థాగత మార్పులని వెల్లడి




ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికాలో తన కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. న్యూజెర్సీలోని తన శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికా (ఎస్ఈఏ) ప్రధాన కార్యాలయాన్ని టెక్సాస్‌కు తరలించడంతో పాటు, పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతను ప్రకటించింది. ఈ మార్పుల వల్ల వందలాది మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ప్రధాన కార్యాలయాన్ని న్యూజెర్సీలోని ఎంగిల్‌వుడ్ క్లిఫ్స్ నుంచి టెక్సాస్‌లోని ప్లానోకు తరలించే ప్రక్రియలో భాగంగా 739 ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని శాంసంగ్ ధృవీకరించింది. వీరిలో ఎక్కువ మందికి టెక్సాస్‌కు మారేందుకు అవకాశం కల్పించగా, ఆసక్తి చూపని వారిని విధుల నుంచి తొలగించారు. దీనికి అదనంగా, టెక్సాస్‌లోని ప్లానో కార్యాలయంలో మొబైల్ విభాగంతో సహా సుమారు 100 మంది ఉద్యోగులను కూడా తొలగించినట్లు కంపెనీ అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైంది. జూన్ 30న సంస్థ వ్యాప్తంగా ఉద్యోగాల కోత ఉంటుందని ఉద్యోగులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. గత కొన్ని వారాలుగా 30 మందికి పైగా సీనియర్ సేల్స్, మార్కెటింగ్ సిబ్బంది తాము కంపెనీని వీడుతున్నట్లు లింక్డ్ఇన్‌లో పోస్టులు పెట్టారు. ఈ మార్పులపై శాంసంగ్ స్పందిస్తూ, “వివిధ బృందాలను ఒకేచోటికి తీసుకురావడం ద్వారా సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు, మెరుగైన సహకార వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, ఏఐ ఎకోసిస్టమ్‌లో భాగం కావాలనే లక్ష్యంతోనే టెక్సాస్‌కు మారుతున్నాం,” అని వివరించింది. ఇది ప్రపంచవ్యాప్త పునర్వ్యవస్థీకరణ కాదని, కేవలం అమెరికాలోని కార్యకలాపాలను ప్రస్తుత వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా మార్చడమేనని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వెనుక శాంసంగ్ వివిధ విభాగాల్లోని పనితీరులో ఉన్న వ్యత్యాసమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒకవైపు ఏఐ ఆధారిత డిమాండ్‌తో సెమీకండక్టర్ (చిప్) వ్యాపారం అద్భుతమైన లాభాలతో దూసుకుపోతుండగా, మరోవైపు యాపిల్, చైనా కంపెనీల నుంచి తీవ్రమైన పోటీ కారణంగా మొబైల్ విభాగం చరిత్రలో తొలిసారిగా నష్టాలను నమోదు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ఏఐ బూమ్ వల్ల చిప్‌ల ధరలు పెరగడం కూడా టీవీలు, గృహోపకరణాల వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం లాభాలపై ఒత్తిడి పెంచుతోంది. 2026 చివరి నాటికి ప్రధాన కార్యాలయ తరలింపు ప్రక్రియ పూర్తికానుంది. టెక్సాస్‌లో శాంసంగ్‌కు ఇప్పటికే చిప్ ఫ్యాక్టరీలు, మొబైల్ హబ్ ఉన్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, టెస్లా వంటి ఇతర టెక్ కంపెనీలు కూడా తమ కార్యకలాపాలను టెక్సాస్‌కు తరలించడం లేదా ఏఐ వైపు దృష్టి సారించడం వంటి ట్రెండ్‌కు అనుగుణంగానే శాంసంగ్ ఈ చర్యలు తీసుకుంది.

# చివరి వన్డే: ఎవరు గెలిస్తే వారిదే సిరీస్... టీమిండియాపై టాస్ నెగ్గిన ఇంగ్లండ్

ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్
గాయం కారణంగా కీలక పేసర్ జస్ప్రీత్ బుమ్రా జట్టుకు దూరం
భారత జట్టులోకి కేఎల్ రాహుల్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్
సిరీస్ విజేతను తేల్చే ఆఖరి మ్యాచ్ లార్డ్స్ వేదికగా ప్రారంభం



లండన్‌లోని లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న సిరీస్ విజేతను తేల్చే మూడో, ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ 3 మ్యాచ్ ల సిరీస్ లో ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలవడంతో నేటి పోరు ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ కీలక మ్యాచ్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మోకాలి గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు బుమ్రా ఎడమ మోకాలికి గాయమైందని, వాపు కారణంగా అతడు మూడో వన్డేకు అందుబాటులో లేదని బీసీసీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బుమ్రాతో పాటు వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబేలను కూడా తుది జట్టు నుంచి తప్పించారు. వారి స్థానాల్లో కేఎల్ రాహుల్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చారు. ఇంగ్లండ్ జట్టులో సాకిబ్ మహమూద్ స్థానంలో జోష్ టంగ్‌కు అవకాశం కల్పించారు. టాస్ అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, “మేము ముందుగా బౌలింగ్ చేయాలనే అనుకున్నాం. ఈ పిచ్‌పై నలుగురు పేసర్లతో ఆడాలనుకున్నాం. గత మ్యాచ్‌లో మంచి స్థితిలో ఉండి కూడా మధ్య ఓవర్లలో వికెట్లు కోల్పోయాం. ఈసారి ఆ పొరపాటు జరగకుండా చూసుకుని, 280-300 పరుగులు లక్ష్యంగా పెట్టుకుంటాం” అని తెలిపాడు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ స్పందిస్తూ, “పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపిస్తోంది. మంచి స్కోరు సాధించి భారత్‌పై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాం. ఈ మ్యాచ్ గెలిచి ట్రోఫీని సొంతం చేసుకుంటామని ఆశిస్తున్నాం” అని ధీమా వ్యక్తం చేశాడు. అన్నింటికీ మించి, ఈ మ్యాచ్ లో అందరి దృష్టి టీమిండియా ‘హిట్ మ్యాన్’ రోహిత్ శర్మపైనే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటీవల ఫామ్ కోల్పోవడంతో జట్టులో రోహిత్ శర్మ స్థానం ప్రశ్నార్థకమైంది. దాంతో, నేటి లార్డ్స్ వన్డేనే రోహిత్ శర్మ కెరీర్ లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ అంటూ ప్రచారం జరిగింది. ఇక రిటైరవ్వాల్సిన సమయం వచ్చిందంటూ సెలెక్టర్లు అతడికి సందేశం ఇచ్చారని వార్తలు వచ్చాయి. అయితే, అలాంటిదేమీ లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టత ఇచ్చాయి. ఈ నేపథ్యంలో, రోహిత్ శర్మ ఇవాళ్టి మ్యాచ్ లో ఎలా ఆడతాడన్నది ఆసక్తికరంగా మారింది.

**రెండు జట్ల వివరాలు**

భారత్: రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ. ఇంగ్లండ్: బెన్ డకెట్, జాకబ్ బెథెల్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), సామ్ కరన్, విల్ జాక్స్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

భారత్: రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.

ఇంగ్లండ్: బెన్ డకెట్, జాకబ్ బెథెల్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), సామ్ కరన్, విల్ జాక్స్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

క్రీడలు

# చిన్న దేశాలు కూడా ఫిఫా వరల్డ్ కప్ లో ఆడుతున్నాయి... మరి మనం ఎక్కడ?

కఠోర శ్రమ, ఐక్యత, పారదర్శక పాలనతోనే లక్ష్యం సాధ్యమని స్పష్టం గ్రాస్‌రూట్స్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు సమూల మార్పులు అవసరమని వెల్లడి ప్రభుత్వ మద్దతు సాధించడం భారత ఫుట్‌బాల్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్య ×ూచీ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షాజీ ప్రభాకరన్ వ్యాఖ్యలు ప్రపంచమంతా ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ ఫీవర్‌లో మునిగిపోయింది. అర్జెంటీనా, స్పెయిన్ మధ్య జరిగే తుదిపోరు కోసం క్రీడాభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో, 140 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత్ ఎందుకు ఈ మెగా టోర్నీకి అర్హత సాధించలేకపోతోంది? అనే ప్రశ్న మరోసారి చర్చనీయాంశమైంది. అయితే, ఈ లక్ష్యం సాధించడం అసాధ్యమేమీ కాదని, అదొక “రాకెట్ సైన్స్” అంతకన్నా కాదని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ూ×ఖీఖీ) మాజీ ప్రధాన కార్యదర్శి షాజీ ప్రభాకరన్ స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. “భారత్ వరల్డ్ కప్‌కు ఎందుకు అర్హత సాధించలేదని ప్రశ్నించడం బాధాకరం. నిజం చెప్పాలంటే, మనం తగినంతగా కష్టపడటం లేదు. మన దగ్గర వనరులు, ప్రతిభ, అభిరుచి అన్నీ ఉన్నాయి. కానీ, అద్భుతాలు జరిగిపోవు. నిరంతర కఠోర శ్రమ, ఐక్యత, పారదర్శక పాలన, సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుంది” అని ఆయన వివరించారు. గ్రాస్‌రూట్స్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అన్ని విభాగాల్లో మార్పులు రావాలని ప్రభాకరన్ నొక్కిచెప్పారు. “కేప్ వెర్డే వంటి చిన్న దేశాలు కూడా పట్టుదలతో అద్భుతాలు చేస్తున్నాయి. వారి నుంచి మనం స్ఫూర్తి పొందాలి. భారత ప్రభుత్వం క్రీడలకు మద్దతిస్తోంది. ఇప్పుడు ఫుట్‌బాల్ పెద్దలు సరైన నిర్ణయాలు తీసుకుని, అందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలి” అని అన్నారు. సరైన ప్రణాళిక, ప్రభుత్వ మద్దతు, కార్పొరేట్ భాగస్వామ్యంతో పనిచేస్తే 10-15 ఏళ్లలో భారత్ వరల్డ్ కప్‌లో ఆడటం సాధ్యమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఫుట్‌బాల్‌ను దేశానికి ఒక ‘సాఫ్ట్ పవర్’గా మార్చవచ్చని, తద్వారా ప్రపంచ వేదికపై మన సంస్కృతిని ప్రదర్శించవచ్చని అభిప్రాయపడ్డారు. తన జీవితకాలంలో భారత్ ప్రపంచకప్‌లో ఆడటాన్ని చూడాలన్నదే తన అతిపెద్ద కల అని ఆయన స్పష్టం చేశారు.



# నాకు ఎవరి అనుమతి అక్కర్లేదు... ఇక నా జీవితం నాదే: అనుపమ పరమేశ్వరన్



**ఇకపై ఎలాంటి అనుమతులు, భయాలు ఉండవంటూ అనుపమ సంచలన పోస్ట్**

**ప్రశాంతత తనను వెతుక్కుంటూ వచ్చిందని ఇన్స్టాగ్రామ్‌లో వెల్లడి**

**ఇన్నాళ్లు తనకు అండగా నిలిచిన అభిమానులకు ధన్యవాదాలు**

**శర్వానంద్‌తో కలిసి నటిస్తున్న 'భోగి' సినిమాలో కనిపించనున్న అనుపమ**

**ఈ చిత్రంలో కందుల సులోచన రాణి అనే పల్లెటూరి యువతి పాత్రలో నటన**

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన, భావోద్వేగ పోస్ట్ చేశారు. తనకు శాంతి దొరికిందని, ఇకపై ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని, భయపడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. "నా గొంతుకను నేనే ఎంచుకుంటా" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె రాస్తూ, "కొన్నిసార్లు శాంతిని కనుగొనడానికి కొన్నింటిని వదిలేయాల్సి ఉంటుంది. ఈ రోజు నాకు ఆ శాంతి దొరికింది. ఈ రోజు నుంచి నా గొంతుకను, నా జీవితాన్ని నేనే ఎంచుకుంటాను. ఇకపై అనుమతులు లేవు, భయాలు లేవు. నన్ను నేను వెతుక్కుంటూ నా జీవితాన్ని ప్రేమిస్తున్నాను" అని పేర్కొన్నారు. చాలా కాలంగా చెప్పాలనుకున్న విషయాన్ని ఇప్పుడు చెబుతున్నానని, ఇంతకాలం దాన్ని చెప్పేందుకు తనను అనుమతించలేదని ఆమె అన్నారు. అభిమానులందరికీ "ఐ లవ్యూ" చెప్పారు. తనపై నమ్మకం ఉంచి, అండగా నిలిచిన అభిమానులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సందేశం, ప్రతి ప్రార్థన తనకు అవసరమైన సమయంలో చేరాయని పేర్కొన్నారు. తనను తిరిగి తన దగ్గరకు చేర్చినందుకు యూనివర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వేచ్ఛను, తనను తాను ఎంచుకోవడాన్ని సంపూర్ణంగా స్వీకరిస్తున్నట్లు అనుపమ తన పోస్ట్‌ను ముగించారు. ఇక అనుపమ కెరీర్ విషయానికొస్తే, ప్రస్తుతం ఆమె శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ డ్రామా 'భోగి'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె కందుల సులోచన రాణి అనే పాత్రలో కనిపించనున్నారు. సులోచన పల్లెటూరి యువతిగా, ప్రకృతితో మమేకమయ్యే బలమైన పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. ఈ సినిమాలో శర్వానంద్ 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు గతంలోనే మేకర్స్ ప్రకటించారు.

## అవకాశాల కోసం అన్నింటికీ ఒప్పుకోను: కాజల్ ఆసక్తికర వ్యాఖ్యలు



మనసు చెప్పిందే వింటానంటున్న కాజల్ అగర్వాల్ అవకాశాల కోసం అన్నింటికీ యస్ చెప్పనని స్పష్టం తల్లి అయ్యాక కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉంటున్నానని వెల్లడి కొడుకు గర్వపడేలా సినిమాలు చేయడమే లక్ష్యమని వ్యాఖ్య సోషల్ మీడియాను 'బ్రెయిన్ పాయిజనింగ్' అని అభివర్ణన చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా రాణిస్తున్న ప్రముఖ నటి కాజల్ అగర్వాల్.. కెరీర్, వ్యక్తిగత జీవితం పట్ల తన దృక్పథం ప్రస్తుతం పూర్తిగా మారిందని వెల్లడించారు. మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్న తాను, ఇప్పుడు మనసుకు నచ్చని విషయాలకు నిర్మొహమాటంగా 'నో' చెబుతున్నానని స్పష్టం చేశారు. కేవలం అవకాశాల కోసమే ప్రతిదానికి 'యస్' చెప్పాల్సిన అవసరం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. నలభై ఏళ్ల వయసులో అడుగుపెట్టి, నాలుగేళ్ల కుమారుడు నీల్‌కు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తరుణంలో తన ఆలోచనా విధానంలో మార్పులు వచ్చాయని కాజల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "ప్రస్తుతం ఏదైనా కథ వింటున్నప్పుడు ఒక తల్లిగా ఆలోచిస్తున్నాను. భవిష్యత్తులో నా కుమారుడు 'ఇది మా అమ్మ సినిమా' అని గర్వంగా చెప్పుకునేలా ఉండాలని కోరుకుంటున్నాను" అని ఆమె తెలిపారు. కెరీర్ తొలినాళ్లలో శరీరాకృతి, పాత్రల విషయంలో ఒత్తిళ్లకు తలొగ్గినప్పటికీ, ఇప్పుడు అలాంటి వాటికి ఆస్కారం ఇవ్వనని స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ'లో న్యాయవాది అర్చన పాత్రను పోషిస్తున్నట్లు కాజల్ వివరించారు. తన శారీరక, మానసిక దృఢత్వానికి నిత్యం చేసే యోగా, వారానికి రెండుసార్లు చేసే వెయిట్ ట్రైనింగ్ మరియు శాకాహారమే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. ఆరోగ్యమే అత్యంత ముఖ్యమని, మిగతావన్నీ ఆ తర్వాతేనని ఆమె హితవు పలికారు. సోషల్ మీడియాను 'బ్రెయిన్ పాయిజనింగ్' (మెదడుకు విషం) తో పోల్చిన కాజల్.. మానసిక ప్రశాంతత కోసం దానికి సాధ్యమైనంత దూరంగా ఉండటమే శ్రేయస్కరమని సూచించారు. నటి దీపికా పదుకొణె ప్రతిపాదించిన ఎనిమిది గంటల పని విధానానికి తాను మద్దతు తెలుపుతున్నానని, తన ఒప్పంద పత్రాల్లోనూ ఇటువంటి నిబంధనలను చేర్చుతానని వెల్లడించారు. అంతేకాకుండా, ఆదివారాలను పూర్తిగా తన కుటుంబానికే కేటాయిస్తానని ఆమె స్పష్టం చేశారు.

# రామాయణం సినిమా కాదు..

## భారత్‌ను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయాణం: రకుల్

**'రామాయణం'పై రకుల్ భావోద్వేగ పోస్ట్**

**శూర్పణఖ పాత్రలో రకుల్**

**రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయి పల్లవి**

**రావణుడిగా యశ్**

**రెండు భాగాలుగా విడుదల**



ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రంలో భాగం కావడం తనకు గర్వకారణమని హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ పేర్కొంది. ఇది కేవలం ఓ సినిమా కాదని, భారత చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప ప్రయాణమని చెప్పింది. ఈ చిత్రంతో ప్రేక్షకులు ఓ అద్భుతమైన ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నారని తెలిపింది. ఢిల్లీలో ఇటీవల జరిగిన 'రామాయణం' ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను రకుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఈ సందర్భంగా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటూ.. ఇంత భారీ స్థాయి చిత్రంలో భాగం కావడం జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిగా అభివర్ణించింది. భారత్‌కు ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తున్న భావన మాటల్లో చెప్పలేనిదని తన పోస్టులో పేర్కొంది. నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. రావణాసురుడి సోదరిగా కథలో కీలక పాత్ర పోషించనున్న ఆమె లుక్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో తొలి భాగాన్ని 2026 దీపావళికి విడుదల చేయనున్నారు. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇంత భారీ స్థాయి చిత్రంలో భాగం కావడం జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిగా అభివర్ణించింది. భారత్‌కు ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తున్న భావన మాటల్లో చెప్పలేనిదని తన పోస్టులో పేర్కొంది.

# జానీమాస్టర్ వివాదం పరిష్కారం... నిషేధం ఎత్తివేసిన ఫెడరేషన్

టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొన్నాళ్లుగా కొనసాగుతున్న వివాదానికి ఫిల్మ్ ఫెడరేషన్ మధ్యవర్తిత్వంతో శుభం కార్డు పడింది. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై విధించిన శాశ్వత నిషేధాన్ని ఫెడరేషన్ అధికారికంగా ఎత్తివేసింది. సినీ పెద్దలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ చొరవ చూపడంతో ఈ సమస్య సామరస్యంగా పరిష్కారమైంది. ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ భేటీకి దర్శకులు, నిర్మాతల మండలి ప్రతినిధులతో పాటు జానీ మాస్టర్, డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత హాజరయ్యారు. వివాదానికి దారితీసిన పరిస్థితులపై జానీ మాస్టర్, సుమలత ఇచ్చిన వివరణతో ఫెడరేషన్ సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం జానీ మాస్టర్‌పై విధించిన నిషేధాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతూ, ఈ వివాదం కారణంగా ఎంతో మంది డ్యాన్సర్లు ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న మెగాస్టార్ చిరంజీవికి, అండగా నిలిచిన నందమూరి బాలకృష్ణకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిరంజీవి స్వయంగా తనతో, శేఖర్ మాస్టర్‌తో మాట్లాడి సమస్యను అర్థం చేసుకున్నారని, బాలకృష్ణ కాకినాడ నుంచి ఫోన్ చేసి సర్దుకుపోవాలని సలహా ఇచ్చారని వివరించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత మాట్లాడుతూ, డ్యాన్సర్ల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. డ్యాన్సర్లు ఇచ్చే రూ.100 చందాతోనే అసోసియేషన్ నడుస్తోందని, కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. సమస్య పరిష్కారానికి సహాయం చేసిన చిరంజీవికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఇది తమ కుటుంబ సమస్య అని, ఇప్పుడు అంతా సద్దుమణిగిందని నిర్మాతల మండలి ప్రతినిధులు అన్నారు. అసోసియేషన్ నుంచి రాజీనామా చేసిన సభ్యులంతా తిరిగి కలిసికట్టుగా పనిచేస్తారని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జనరల్ సెక్రటరీపై చర్యల విషయంలో ఈ నెల 26న జరిగే జనరల్ బాడీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455